క్లుప్తంగా

వలంటీర్ల రాజీనామా



ఎంపీడీఓ శ్రీనివాసరావుకు రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు

రాజమహేంద్రవరం రూరల్: ప్రజలకు సేవ చేస్తుంటే తమపై రాజకీయ పార్టీలు నిందలు వేస్తున్నారని వలంటీర్లు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం రూరల్ మండలంలో 39 మంది వలంటీర్లు రాజీనామాలు చేశారు. హుకుంపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో డి.శ్రీనివాసరావుకు రాజీనామా పత్రాలను అందజేశారు. బొమ్మూరు-1గ్రామ సచివాలయం పరిధిలో ఇద్దరు, ధవళేశ్వరం -2 గ్రామ సచివాలయం పరిధిలో ఒకరు, ధవళేశ్వరం -4 గ్రామ సచివాలయం పరిధిలో 13 మంది, ధవళేశ్వరం-5 గ్రామ సచివాలయం పరిధిలో ఆరుగురు, కోలమూరు-1గ్రామ సచివాలయం పరిధిలో ఆరుగురు, కోలమూరు-4 గ్రామసచివాలయం పరిధిలో 8మంది, పిడింగొయ్యి-4 గ్రామసచివాలయం పరిధిలో ఒకరు, కాతేరు-1 గ్రామసచివాలయం పరిధిలో ఇద్దరు వలంటీర్లు రాజీనామా చేశారు.

చందన నాగేశ్వర్ పరామర్శ



ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న విష్ణుమూర్తి కుమారుడిని పరామర్శిస్తున్న చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరంలో ప్రైవేటు ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న వైఎస్సార్ సీపీ మండల జేసీఎస్ కన్వీనర్ తాటికొండ విష్ణుమూర్తి కుమారుడిని సోమవారం ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ పరామర్శించారు. విష్ణుమూర్తిని ఆయన కుమారుడు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయనతో మింది నాగేంద్ర, కొప్పిసీడి రాజమౌళి ఉన్నారు.

కడియంలో 'ఇంటింటా రామాయణం'

కడియం: గ్రామంలో నిర్వహించిన ఇంటింటా రామాయణం కార్యక్రమానికి అపూర్వ స్పందన లభించింది. మేకల దిబ్బ సెంటర్‌లో నిర్మించిన శ్రీరామకృష్ణుడి ఆలయం వద్ద సేకరణ,వితరణ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని తణుకుకు చెందిన ఆనోళ్ల రామం నిర్వహించారు. సనాతన ధర్మం రామాయణ విశిష్టత రాముని గొప్పతనం తదితర అంశాలు వివరించారు. భక్తులకు రామాయణ పట్టాభిషేకం చిత్ర పటాలకు ఉచితంగా అందించారు. స్థానిక భక్తులు గెద్దాడ సూరిబాబు, కదలి విజయదుర్గ సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో ప్రభావతి, పద్మావతి, వరలక్ష్మి, బేబి, విజయదుర్గ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని సాగనంపుదాం

ప్రకాశం నగర్: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మతతత్వ పార్టీ బీజేపీని ఓడించి, ఇండియా కూటమిని గెలిపించుకోవాలని సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కె.రామకృష్ణ, వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఆనం రోటరీ హాల్‌లో ఇండియా కూటమి ఆత్మీయ సమావేశం సందర్భంగా లౌకిక రాజ్యాంగ ప్రజాస్వామ్య పరిరక్షణ సభ నిర్వహించారు. సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శి లు టి.అరుణ్, తాటిపాక మధు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ మాట్లాడారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు జంగా గౌతమ్, ప్రముఖ రచయిత డీవీఎస్ వర్మ, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కుండ్రపు రాంబాబు, సీపీఎం నగర కార్యదర్శి బి.పవన్ , సీపీఐ నగర కార్యదర్శి వి.కొండలరావు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు తులసి, జువ్వల రాంబాబు, కాంగ్రెస్ పార్టీ ఎంఎల్ఏ అభ్యర్థులు బోడా వెంకట్, బలేపల్లి మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో దూకుడు

- సత్తా చూపుతున్న ప్రభుత్వ కళాశాల విద్యార్థులు
- పెరుగుతున్న ఉత్తీర్ణత శాతం
- ప్రభుత్వ ప్రోత్సాహంతో ముందంజ

కంబాలచెరువు: పట్టుదల ఉంటే ఏదైనా సాధించగలమని ప్రభుత్వ కళాశాల విద్యార్థులు నిరూపిస్తున్నారు. తమలోని ప్రతిభను వెలికితీసి అందరికీ చాటి చెబుతున్నారు. విద్యాబోధనలో ప్రభుత్వ విద్యాసంస్థలు దూసుకెళుతున్నాయి. దీనికి నిదర్శనం ఇటీవల విడుదలైన ఇంటర్మీడియెట్ ఫలితాలే. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన అన్ని వనరులు, సౌకర్యాలను కల్పిస్తూ వారిని మరింత ప్రోత్సహించే దిశగా విద్యాశాఖాధికారులు కృషి చేస్తున్నారు. ఆ కోవలో రాజమహేంద్రవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందుంది. ఇటీవల విడుదలైన ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాల విద్యార్థులు తమ సత్తా చాటారు. గత ఏడాది ఇదే ఒరవడి సృష్టించారు. ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం జనరల్ విభాగం బైపీసీ గ్రూపులో 939, ఎంపీసీ విభాగంలో 925, సీఈసీ విభాగంలో 915 మార్కులు విద్యార్థులు సాధించారు. కళాశాలలో మొత్తం 278 మంది జనరల్ విభాగం విద్యార్థులు ఇంటర్మీడియెట్ చదువుతుండగా వారిలో 168 మంది ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ విభాగంలో 172 మందికి 146 మంది పాసై 85 శాతం ఉత్తీర్ణత సాధించారు.



ప్రభుత్వ జూనియర్ కళాశాల

రెండో సంవత్సరంలో..

ద్వితీయ సంవత్సరంలో ఎం.భాను అనే విద్యార్థిని బైపీసీ గ్రూపులో 939 మార్కులు సాధించి కళాశాలలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఎంపీసీలో సీహెచ్ మంజు, జి.అరవింద్ అనే విద్యార్థులు 925 మార్కులు, సీఈసీ విభాగంలో ఎం.మోహన్‌కృష్ణ 915, పి.శిరీష ఇంగ్లిష్ మీడియంలో 913 మార్కులు సాధించి ప్రతిభ కనపర్చారు. ఒకేషనల్ విభాగం ఎంఎల్‌టీ గ్రూపులో ఎం.లావణ్య 974 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలవగా, జి.గీత 965 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచింది. మొదటి సంవత్సరంలో ఎంపీసీ గ్రూపులో ఎం.ప్రవల్లిక 470కు 444, బైపీసీలో 440కు 458 మార్కులు సాధించారు. ఒకేషనల్ ఎంపీహెచ్ డబ్ల్యూ గ్రూపులో పి.దుర్గప్రసన్న 500 కు 485 మార్కులు సాధించింది.

పెరిగిన ఉత్తీర్ణత శాతం

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గత ఏడాదిలో పోల్చితే ఉత్తీర్ణత శాతం పెరిగింది. ఈ ఏడాది జనరల్ విభాగంలో 9 శాతం, ఒకేషనల్ విభాగంలో 18 శాతం ఉత్తీర్ణత పెరిగింది. జూనియర్ కళాశాల విద్యార్థులను ఇంటర్ పరీక్షలకు పూర్తిగా సిద్ధం చేశారు. వారికి ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేసి మంచి మార్కులు సాధించేలా కళాశాల ప్రిన్సిపాల్, బోధనా సిబ్బంది కృషి చేశారు. అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన జూనియర్ కళాశాల విద్యార్థులను ఇంటర్ బోర్డు రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఐ.శారద ప్రత్యేకంగా అభినందించారు.

> **చక్కని ప్రణాళిక**
>
> 
>
> **ఇంటర్ ఫలితాల్లో మంచి ఉత్తీర్ణత సాధించాం. దీనికి ఏడాది** ప్రారంభంలోనే చక్కని ప్రణాళిక వేసుకున్నాం. దానికనుగుణంగా అధ్యాపకులు విద్యార్థులకు బోధించారు. వెనుకబడిన వారిని గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహించాం. దీంతో విద్యార్థులు పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించారు. ఇందులో అధ్యాపకుల కృషి మరువలేం. పరీక్షలు దగ్గర పడుతున్న సమయంలో మాక్ పరీక్షలు నిర్వహించి విద్యార్థుల అభ్యసనా స్థాయి తెలుసుకున్నాం.
>
> –ఎస్ఎస్‌వీఎల్ నర్సింహం, ఆర్‌ఐవో, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల

సీఎం జగన్ క్షేమం కోరుతూ షర్మిలారెడ్డి పూజలు



పూజలు నిర్వహిస్తున్న షర్మిలారెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: ముఖ్యమంత్రి జగనన్న క్షేమం కోరుతూ ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ బోర్డ్ కార్పొరేషన్ చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. నగరంలో జాంపేటలోని ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా షర్మిలారెడ్డి మాట్లాడుతూ జగనన్న బస్సు యాత్రకు వస్తున్న ప్రజాదరణ చూసి సహించలేక టీడీపీ, జనసేన పార్టీలు ఒక పథకం ప్రకారం భౌతిక దాడులకు పాల్పడ్డాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ఇటువంటి దాడులు ఒక పిరికి పంద చర్యగా అభివర్ణించారు. హత్యాయత్నం ఘటనపై సమగ్ర విచారణ చేసి, దోషులను శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బూడిద శరత్‌కుమార్ పాల్గొన్నారు.

బాధితులకు మంత్రి వేణు పరామర్శ



అగ్నిప్రమాద ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మంత్రి వేణు

కడియం: జేగురుపాడు బీసీ కాలనీలో జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలను మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ , సర్పంచ్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్రస్టాలిన్, అనసూరి పద్మలతతో కలిసి పరామర్శించారు. బాధితులు మంగళగిరి శ్రీను, వద్దాది లక్ష్మీ, బుడ్డిగ గోవింద్‌లను కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆకుల సుధాకర్, నాగిరెడ్డి శివాజీ, మారిశెట్టి నాగన్న, నాగిరెడ్డి మోహన్, మద్దుకూరు గోపి, సాకా కిరణ్‌కుమార్, బల్లా అన్నవరం ఉన్నారు.

వైఎస్సార్ సీపీ విజయం ఖాయం

- ధవళేశ్వరంలో టీడీపీ నుంచి 500 మంది వైఎస్సార్ సీపీలో చేరిక
- కండువాలు వేసి ఆహ్వానించిన మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ



ధవళేశ్వరంలో ప్రచారం చేస్తున్న మంత్రి చెల్లుబోయిన వేణు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి



వైఎస్సార్ సీపీలో చేరిన మహిళలతో మంత్రి వేణు, షర్మిలారెడ్డి

ధవళేశ్వరం: జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయ ఢంకా మోగించడం ఖాయమని, జగన్ మళ్లీ ముఖ్యమంత్రి హోదాలో సుపరిపాలన అందించనున్నారని మంత్రి, వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పేర్కొన్నారు. ధవళేశ్వరం లక్ష్మీజనార్దన స్వామి కాలనీకి చెందిన టీడీపీ సీనియర్ నాయకురాలు పేరాబత్తుల శ్రీదేవి, ఆమె కుమారుడు పేరాబత్తుల సునీల్, పంపన సత్యవతి, పిట్ల స్వతవేణి 500 మంది అనుచరులతో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు నక్కా రాజుబాబు తదితరులు కండువాలు వేసి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించారు. అనంతరం మంత్రి వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సుపరిపాలన అందిస్తున్నారని పేర్కొన్నారు. గడచిన ఐదేళ్లల్లో గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా అమలు చేయని సంక్షేమ పథకాలు అమలు చేసి కుటుంబానికి పెద్ద కొడుకుగా ,వృద్ధులకు మనువడిగా, చెల్లికి అన్నగా నిలిచి బాధల్లో ఉన్న వారిని ఆదుకున్నారని అన్నారు. జగనన్న పాలనలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందాయన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమం, ఛివృద్ధి కొనసాగాలన్న, ఇంటి వద్దకే సంక్షేమ ఫలాలు చేరాలన్నా మళ్లీ వైఎస్ జగన్ ముఖ్యమంత్రి కావాలన్నారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించి జగన్‌ను ముఖ్యమంత్రిని చేయాలని మంత్రి వేణు పిలుపునిచ్చారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి మాట్లాడుతూ మీ కుటుంబాల్లో మంచి జరిగిందనుకుంటేనే ఓటు వేయమని ధైర్యంగా చెప్పిన నేత సీఎం జగన్ ఒక్కరే అన్నారని అన్నారు. జగన్ పాలనలో ప్రతి కుటుంబం ఏదో ఒక పథకం ద్వారా లబ్ధి పొందిందన్నారు. స్థానికంగా ఉన్న సమస్యలను జగనన్న మళ్లీ అధికారం చేపట్టగానే వెంటనే తీరుస్తామని హామి ఇచ్చారు.

ఇంటింటా ఎన్నికల ప్రచారం

లక్ష్మీజనార్దనస్వామి కాలనీలో మంత్రి వేణు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్‌వీ శేఖర్, సాధనాల చంద్రశేఖర్ (శివ),మెండా రాజేష్, తలారి వరప్రసాద్, దేవులపల్లి సరితారాణి, షేక్ మస్తాన్, పెన్నాడ జయప్రసాద్, చాటకాల చంటి, కాశీ కుమార్, చంద్రమల్ల పాపారావు, వైరాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మన గోదావరి ఫొటో ప్రదర్శన



ఛాయాచిత్రాలను తిలకిస్తున్న విశ్వేశ్వరరావు, రామ్మోహనరావు తదితరులు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక అల్కాట్‌తోటలోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో సోమవారం తూర్పు గోదావరి జిల్లా అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని 'మన గోదావరి' అనే అంశంపై ఫొటో ప్రదర్శనను నిర్వహించారు. ఈ ఫొటో ప్రదర్శనను యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ విశ్వేశ్వరరావు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫొటోగ్రఫీలో శిక్షణ పొందిన అభ్యర్థులకు ఇటువంటి ఫొటో ప్రదర్శనలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. యూనియన్ బ్యాంక్ రీజనల్ డిప్యూటీ హెడ్ రామ్మోహనరావు, డీఆర్‌డీఏ, క్రాంతి పథకం ప్రాజెక్టు డైరెక్టర్ మూర్తి తదితరులు పాల్గొని ఫొటోప్రదర్శనలోని ఫొటోలను తిలకించి నిర్వాహకులను అభినందించారు. సంస్థ డైరెక్టర్ తాడి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఫొటోగ్రఫీ శిక్షణలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఫొటోగ్రఫీ ట్రైనీస్ చిత్రీకరించిన ఛాయాచిత్రాలను ఈ ప్రదర్శనలో పెట్టామన్నారు. మంగళవారం కూడా ఫొటోప్రదర్శన కొనసాగుతుందని డైరెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు.

అభివృద్ధిని చూడండి.. ఆశీర్వదించండి



నగరంలో పర్యటిస్తున్న ఎంపీ భరత్ రామ్

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో ఎంపీగా నేను చేసిన అభివృద్ధి చూసి రానున్న ఎన్నికలలో సిటీ ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్ రామ్ కోరారు. సోమవారం నగరంలోని 38వ డివిజన్ సీతంపేట కృష్ణా నగర్ తదితర ప్రాంతాలలో క్షేత్ర స్థాయి పర్యటన నిర్వహించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడచిన ఈ అయిదేళ్లలో రెండున్నర సంవత్సరాలు కరోనా కాగా, మిగిలిన రెండున్నర సంవత్సరాలలో అద్భుతమైన అభివృద్ధి పనులను సాధించామన్నారు. టీడీపీ నేతల్లా ఎన్నికల సమయంలో ప్రజల వద్దకు వచ్చి మాయమాటలతో నమ్మించి, గెలిచిన తరువాత కనబడకపోవడం నాకు చేతకాదన్నారు. ఎంపీగా గెలిచి నగరాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి అత్యద్భుతంగా తీర్చి దిద్దానన్నారు. మాజీ ఎంపీ మురళీమోహన్, ప్రస్తుత టీడీపీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ నగరానికి కానీ, ప్రజలకు కానీ చేసిందేమీ లేదన్నారు. గత పుష్కరాలకు వేల కోట్లు మంజూరైనా నగరానికి చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. అభివృద్ధికి నేనేమి చేశానో చెప్పగలనని అందుకే ధైర్యంగా ప్రజల వద్దకు వెళ్లిఓటర్లను కలిసి ఆశీర్వదించమని, ఎమ్మెల్యేగా గెలిపించమని కోరుతున్నానన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, నగర మహిళా విభాగం అధ్యక్షురాలు మార్తి లక్ష్మి, పాలిక శ్రీనివాస్, అరిగెల బాబు, తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికలలో పీఓ, ఏపీఓలు కీలకం

- రిటర్నింగ్ అధికారి, జేసీ తేజ్‌భరత్
- పీఓ, ఏపీఓలకు ఒక రోజు శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జేసీ తేజ్‌భరత్

రాజమహేంద్రవరం రూరల్: సార్వత్రిక ఎన్నికలు సమర్థవంతంగా పూర్తి చేయడంలో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు సంబంధించి విధుల నిర్వహణ అత్యంత కీలకమని రాజమహేంద్రవరం రూరల్ అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టరు ఎస్.తేజ్‌భరత్ స్పష్టం చేశారు. సోమవారం కవలగొయ్యిలో దిఫ్యూచర్‌కిడ్స్ స్కూల్లో సాధారణ ఎన్నికలు-2024 అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనరు(ఏ ఎంఎల్‌టీ)ల ఆధ్వర్యంలో పీఓ, ఏపీఓలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జేసీ ఎస్.తేజ్ భరత్ మాట్లాడుతూ రూరల్ నియోజకవర్గ పరిధిలో 774 మంది ఎన్నికల సిబ్బందికి ఎన్నికల ప్రక్రియలో నిర్వర్తించాల్సిన బాధ్యతలపై అవగాహన కల్పించారన్నారు. పోలింగ్ ముందు రోజు, తర్వాత రోజు చేయాల్సిన విధులను వివరించారు. ప్రిసైడింగ్ అధికారులు సమర్థవంతంగా సమన్వయం సాధించడం ద్వారా ఎన్నికల విధులకు ఆటంకం లేకుండా పూర్తి చేయవచ్చన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియలో శిక్షణ తరగతులకు హాజరైన వారి నుంచి ఫారం-12 లను కూడా స్వీకరించామన్నారు. ఆ మేరకు గ్రామ రెవెన్యూ అధికారులకు సూచనలు ఇచ్చినట్టు తెలిపారు. శిక్షణ తరగతి గదులు సందర్శించి హాజరైన ఎన్నికల సిబ్బందితో మాట్లాడి తగిన సూచనలు చేశారు. ఎపిక్ నిర్ధారణ కోసం డిజిటల్ అసిస్టెంట్లకు కూడా వారి పాత్రను వివరించి తగిన సూచనలు ఇచ్చినట్టు తెలిపారు. శిక్షణలో భాగంగా వారికి అందచేసిన శిక్షణపై మూల్యాంకన పరీక్ష నిర్వహించినట్టు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ ఐ.సాయిబాబు, రూరల్ తహసీల్దార్ వై.కె.వి. అప్పారావు, కడియం తహసీల్దార్ బి.రమాదేవి, ప్లానింగ్ అధికారి కోటయ్య, ఎంపీడీవోలు డి.శ్రీనివాసరావు, మనోజ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్లు, మాస్టర్ ట్రైనర్‌లు, పీఓలు, ఏపీఓలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నిక



జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు

ప్రకాశం నగర్ : జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక సోమవారం హుకుంపేటలోని గోదావరి రుచులు హోటల్లో జరిగిన సమావేశంలో 2024- 2028 నూతన జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా చామకూర శ్రీనివాసరావుతో పాటు ప్రధాన కార్యదర్శిగా డీవీవీ సత్యనారాయణ, కోశాధికారిగా శివాజీరాజ్, ఉపాధ్యక్షుడిగా అద్దూరి రమణ, సంయుక్త కార్యదర్శిగా డి.పాండురంగ విటల్, కార్యనిర్వాహక కార్యదర్శిగా డి.వినయ్ సాయికుమార్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథులుగా ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి కె.పద్మనాభం, ఏపీ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు మద్ది ప్రభాకర్‌రావు, అద్దూరి రమణ, జాతీయ వెయిట్ లిఫ్టింగ్ కోచ్ డీన్‌లు హాజరయ్యారు. నూతన కార్యవర్గాన్ని వారు ప్రకటించారు. పవర్ లిఫ్టింగ్‌పై క్రీడాకారుల్లో ముఖ్యంగా యువతలో ఆసక్తిని పెంచుతామని నూతన అధ్యక్షుడు చామకూర శ్రీనివాసరావు అన్నారు.

జగన్‌తోనే పారదర్శక పాలన

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- చినకొండేపూడిలో 50 మంది వైఎస్సార్ సీపీలో చేరిక

సీతానగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే పారదర్శక పాలన సాధ్యమవుతుంది ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తెలిపారు. సోమవారం చినకొండేపూడి వైఎస్సార్ సీపీ నాయకులు పోలినాటి ఈశ్వరుడు నివాసం వద్ద కోటి సూరిబాబు, కోనే శ్రీను(టైగర్), ఉక్కంపేట పోశియ్య, శెట్టి అబ్బులు, మేడిశెట్టి త్రిమూర్తులు, మేడిశెట్టి సత్యనారాయణ, రావూరి డాక్టర్‌బాబు, కోటి రామకృష్ణ, పరటాల శ్రీను, వాకపల్లి వెంకటేశులు, జెనుల సత్తిబాబు, రాంబాబు, లక్కిశెట్టి సత్యనారాయణ తదితరులతోపాటు 50 మందికి వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జక్కంపూడ రాజా మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యానికి గురైన నియోజకవర్గానికి ఎన్నడు లేని విధంగా అభివృద్ధిచేశామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మాత్రమే పారదర్శక పాలన అందించారని అన్నారు. సీతానగరం మండలంలో పలు అభివృద్ధి పనులు చేశామని, అందులో భాగంగా కాతేరు - సీతానగరం వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డును నాలుగు లైన్ల రోడ్డు పూర్తికావచ్చిందన్నారు. సీతానగరం పీహెచ్‌సీని అప్‌గ్రేడ్ చేసి 30 పడకల ఆసుపత్రిగా రఘుదేవపురంలో పనులు జరుగుతున్నాయని గుర్తు చేశారు. గ్రామాల్లో జరిగిన అభివృద్ధిని చూసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఆయన కోరారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా జగనన్న, నియోజకవర్గంలో ఎమ్మెల్యే తనను, ఎంపీగా గూడూరి శ్రీనివాస్‌లు అత్యధిక మెజార్టీతో గెలుపు ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, వైస్‌ఎంపీపీలు ముదునూరి సురేష్‌బాబు, సత్యం మదన్‌బాబు, మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, ఆర్బీకే చైర్మన్ వలవల వెంకట్రాజు, సర్పంచ్ చెరుకూరి శ్రీనివాస్, ఉపసర్పంచ్ సత్తిపండురాజు, పోలినాటి రామచంద్రరావు, ముదునూరి రామకృష్ణరాజు, మేడిశెట్టి చిన్నికృష్ణ, కోనే శ్రీను (ఇంద్ర), యర్రంశెట్టి బాబులు తదితరులు పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతికి మూలం శ్రీరాముడు

- సమాజంలో నైతిక విలువలు నెలకొల్పాలి
- డాక్టర్ కర్రి రామారెడ్డి
- రేపు భారీ బైక్ ర్యాలీ జయప్రదం చేయాలని శ్రీరామ ఉత్సవ సమితి పిలుపు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉత్సవ సమితి సభ్యులు

సీటీఆర్ఐ: తాను దేవుడునని తెలియకుండా మనిషిగా జీవించి, కోట్లాది మంది హృదయాల్లో నిలిచిన శ్రీరాముడు జాతికి స్ఫూర్తిదాయకమని శ్రీరామ ఉత్సవ సమితి గౌరవ అధ్యక్షుడు డాక్టర కర్రి రామారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనదేశ సంస్కృతికి శ్రీరాముడు ప్రతీక అన్నారు. గడచిన రెండేళ్లుగా ప్రతి సంవత్సరం శ్రీరామనవమి సందర్భంగా సమితి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించిన నేపథ్యంలో ఈ సంవత్సరం కూడా శ్రీరామనవమి పురస్కరించుకుని బుధవారం నగరంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్టు ఆయన చెప్పారు. గతంలో మన సంస్కృతిపై భౌతికంగా దాడి జరిగిందని, ఇప్పుడు భౌతికంగా కాకపోయినా సాంస్కృతిక దాడి కొనసాగుతూనే ఉందని అన్నారు. ఇలాంటి పరిస్థితిల్లో సమాజంలో నైతిక విలువలను పెంపొందించేందుకు శ్రీరాముడి వ్యక్తిత్వాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. భారీ బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఆర్టిస్టు రామ్మోహన్‌కు సత్కారం

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడికి చెందిన కన్నాబత్తుల రామ్మోహన్ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటాన్ని గీసినందుకు ఆదివారం విజయవాడలో సత్కరించినట్టు తెలిపారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం విజయవాడలో చిత్రకారుల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొనగా తనకు సత్కారం అందినట్టు తెలిపారు.

సినిమాలు

శ్యామల	: గీతాంజలి మళ్లీ వచ్చింది
సూర్యమినీ	: మైదాన్
సూర్యప్యాలెస్	: మంజుమ్మల్‌బాయ్స్
స్వామి	: దిఫ్యామిలీస్టార్
శివజ్యోతి	: లవ్‌గురు
అనుశ్రీ	: మంజుమ్మల్‌బాయ్స్
రాజా	: బడేమియా చోటేమియా
ఊర్వశి	: శ్రీరంగనీతులు
రంభ	: బడేమియా చోటేమియా
మేనక	: ప్రాజెక్టు 2
అప్సర	: టిల్లుస్క్వేర్
కుమారి	: టిల్లుస్క్వేర్
నామవరం	
వీఎస్ మహల్	: దిఫ్యామిలీస్టార్, లవ్‌గురు
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: దిఫ్యామిలీస్టార్, టిల్లుస్క్వేర్
కడియం	
వెంకటసూర్య	: గీతాంజలి మళ్లీ వచ్చింది